# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 12-03-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **మేకిన్ ఇండియా నినాదంతో భారతీయ రైల్వేకు సరికొత్త భవిష్యత్తును ఇవ్వబోతున్నట్లు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటించారు.**

**2.** **విజయవాడలో పలు అభివద్ధి పనులకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ఈ రోజు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.**

**3.** **పేదల సొంతింటి కల సాకారమయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం వైఎస్‌ఆర్ జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు చేపట్టిందని గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తెలిపారు.**

**4.** **కరవు, మిగ్‌జాం తుపాను వంటి విపత్కర పరిస్థితుల్లో సైతం రాష్ట్రంలో ఆహార ధాన్యాల దిగుబడులు పెరిగాయని వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ హరికిరణ్ పేర్కొన్నారు.**

**5.** **విద్యుత్ వినియోగదారులపై ఎటువంటి ఛార్జీల భారం లేకుండా కొత్త టారిఫ్‌ను రూపొందించామని రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఛైర్మన్ జస్టిస్ సి.వి. నాగార్జున రెడ్డి తెలిపారు.**

==========================

భారత్‌లో తయారీ... మేకిన్ ఇండియా నినాదంతో భారతీయ రైల్వేకు సరికొత్త భవిష్యత్తును ఇవ్వబోతున్నట్లు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటించారు. మనదేశంలో తయారై విజయవంతంగా నడుస్తోన్న సెమీ హైస్పీడ్ రైళ్లకు విదేశాల్లో డిమాండ్ పెరుగుతోందని అన్నారు. అహ్మదాబాద్ నుంచి వర్చువల్‌గా దేశవ్యాప్తంగా 10 వందేభారత్ రైళ్లతో పాటు అనేక రైలు ప్రాజెక్టుల ప్రారంభోత్సవాల్లో పాల్గొన్న ప్రధానమంత్రి... భువనేశ్వర్–విశాఖపట్నం–భువనేశ్వర్ మధ్య వందేభారత్ రైలును ప్రారంభించారు. రైల్వేలు శతశాతం విద్యుదీకరణ దిశగా వేగవంతమైన అడుగులు వేస్తున్నాయని ప్రధాని తెలిపారు. రైల్ నెటవర్కింగ్‌లో ఆటోమేటిక్ సిగ్నలింగ్, అన్ని స్టేషన్లలో సోలార్ వ్యవస్థలు, అలాగే జన ఔషధ్ కేంద్రాలు ప్రవేశపెడుతున్నట్లు ప్రధాని పేర్కొంటూ...

వాయిస్ – 37 సెకన్లు

అలాగే కొత్తవలస–కోరాపుట్ సెక్షన్లు, కోరాపుట్–రాయగడ లైన్లలో రెండు డబ్లింగ్ ప్రాజెక్టులు, విజయనగరం–టిట్లాగఢ్ థర్డ్ లైన్ ప్రాజెక్ట్‌లో పూర్తి చేసిన భాగాలను, గూడ్స్ షెడ్, వాల్తేర్ డివిజన్‌లో 7చోట్ల వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్ స్టాల్స్‌ను నరేంద్ర మోదీ ప్రారంభించారు.

--------------------------

పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా

పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన స్టాల్‌ను తణుకు, నరసాపురం రైల్వే స్టేషన్లలో ఆధునీకరించిన గూడ్స్ షెడ్‌లను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ రోజు వర్చువల్ విధానంలో ప్రారంభించారు. నారతో తయారు చేసిన జ్యూట్‌బ్యాగ్‌ల విక్రయ శాలను తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈతకోట తాతాజి ఆకావాణితో మాట్లాడుతూ... వన్ నేషన్ వన్ రేషన్, వన్ స్టేషన్ వన్ ప్రొడక్టులో భాగంగా స్థానికంగా మహిళలు నారతో అల్లిన బ్యాగ్‌లను ఏర్పాటు చేయడం మహిళా సాధికారితకు నిదర్శనమని అన్నారు. రైల్వేలు అభివృద్ధి చేయడంతో పాటు వేగంగా నడిచే రైళ్ళను ప్రవేశపెట్టడం జరిగిందని తెలిపారు.

---------------------------

వన్ స్టేషన్ వన్ ప్రోడక్ట్ స్టాళ్లను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృశ్యమాధ్యమ విధానంలో ఈరోజు ప్రారంభించిన క్రమంలో మచిలీపట్నం రైల్వే స్టేషన్‌లో కూడా స్టాల్‌ను ప్రారంభించారు. మచిలీపట్నంలో చిరు వ్యాపారస్తులు వర్తకులు తయారు చేసే వన్ గ్రామ్ గోల్డ్, కలంకారి వస్త్రాలకు దేశవ్యాప్తంగా ప్రాచుర్యం ఉందని కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక నేతలు తెలిపారు. ఆ వస్తువులకు రైల్వేస్టేషన్‌ల ద్వారా మరింత మార్కెటింగ్ సదుపాయం అందించి వ్యాపారస్తులకు సహాయకారిగా ఉండేందుకు వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్ స్టాల్ ఎంతగానో ఉపయోగపడుతుందని హర్షం వ్యక్తం చేశారు.

---------------------------

తిరుపతి రైల్వేస్టేషన్‌లో భారతీయ జనఔషధీ కేంద్రాన్ని వర్చువల్ విధానం ద్వారా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు ప్రారంభించారు. పార్లమెంటు సభ్యులు గురుమూర్తి, పలువురు ప్రజా ప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని తిరుపతి రైల్వేస్టేషన్ నుంచి తిలకించారు. అలాగే కొల్లంటు తిరుపతి నూతన రైలును ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించగా ఆ కార్యక్రమాన్ని కూడా తిరుపతిలో ప్రజా ప్రతినిధులు తిలకించారు. ఈ సందర్భంగా తిరుపతి ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ... ప్రపంచ నలుమూలల నుంచి తిరుపతి రైల్వేస్టేషన్‌కు ప్రతిరోజు 50 నుంచి 70 వేల మందికి పైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తూ ఉంటారని అన్నారు. తక్కువ ధరకే జనఔషధ కేంద్రాన్ని ప్రారంభించుకోవడం ప్రయాణీకులకు ఉపయోగకరంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

---------------------------

విజయవాడలో పలు అభివద్ధి పనులకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ఈ రోజు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. 369 కోట్ల రూపాయలతో 2.26 కిలో మీటర్ల మేర నిర్మించిన రిటైనింగ్ వాల్‌ను ప్రారంభించారు. అనంతరం 12.40 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసిన కృష్ణా రివర్ ఫ్రంట్ సుందరీకరణ, 14.93 కోట్ల రూపాయలతో ఆధునికీకరించిన రామలింగేశ్వరనగర్ 20 ఎంఎల్డీ ఎస్టీపీ ప్లాంట్ ప్రారంభించారు. రిటైనింగ్ వాల్ నిర్మించాలన్న ఆలోచన గతంలో ఎవరూ చేయలేదని 12 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా భయం లేదని అన్నారు. గోడ వెంబడి ఆహ్లాదకరమైన రివర్ ఫ్రంట్ పార్క్‌ను ఏర్పాటు చేశామని మోడ్రన్ ఎంట్రీ ప్లాజా, వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, చిన్నారులకు ఆటస్థలం, గ్రీనరీతో సుందరంగా పార్కును తీర్చిదిద్దామని తెలిపారు. అనంతరం శాశ్వత హక్కులతో పేదలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ....

వాయిస్ – 26 సెకన్లు

---------------------------

రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు చేపట్టి పేదల సొంతింటి కల సాకారమయ్యేలా చేస్తోందని గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ పేర్కొన్నారు. పెనమలూరు నియోజకవర్గం కంకిపాడు మండలం వణుకూరులో జగనన్న నవరత్నాల్లో భాగంగా పేదలందరికీ పంపిణీ చేసిన ఇళ్ళను హౌసింగ్

ఉన్నత శాఖ అధికారులతో కలిసి నిన్న ఆయన పరిశీలించారు. కంకిపాడు గ్రామంలో 14 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన అంగన్వాడి భవన కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమం సహా పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు.

---------------------------

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనానికి వచ్చే సామాన్య భక్తులను దృష్టిలో ఉంచుకొని తక్కువ ధరకే నాణ్యమైన ఆహారం అందించే విధంగా ఏపీ టూరిజం అధ్వర్యంలో మూడు కొత్త రెస్టారెంట్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. తిరుమలలో మూడు ప్రాంతాల్లో పర్యాటక శాఖామంత్రి ఆర్కే రోజా టూరిజం హోటల్స్‌ను ప్రారంభించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... స్టార్ హోటల్ స్థాయిలో రూపురేఖలు మార్చి తిరుమలలోని అన్నమయ్య భవన్., బాలాజీ., నారాయణగిరి టూరిజం హోటల్స్‌ను భక్తులకు అందుబాటులో తెచ్చామని చెప్పారు. తక్కువ ధరకే నాణ్యమైన ఆహారాన్ని భక్తులకు అందిస్తామని రోజా తెలిపారు.

---------------------------

కరవు, మిగ్‌జాం తుపాను వంటి విపత్కర పరిస్థితుల్లో సైతం రాష్ట్రంలో ఆహార ధాన్యాల దిగుబడులు పెరిగాయని వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ హరికిరణ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో అనూహ్య పరిస్థితులు నెలకొన్న సమయంలో శాస్త్రవేత్తల సూచనల మేరకు పంటల ప్రణాళికలు తయారు చేశామన్నారు. అనుకూలంగా ఉండే విత్తనాలను 80 శాతం రాయితీపై రైతులకు అందించామని, మందుల పిచికారితో దెబ్బతిన్న పంటలు తేరుకున్నాయని ఒక ప్రకటనలో తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ వినియోగదారులపై ఎటువంటి ఛార్జీల భారం లేకుండా కొత్త టారిఫ్‌ను రూపొందించామని ఏపీఈఆర్సీ ఛైర్మన్ జస్టిస్ సి.వి. నాగార్జున రెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన విద్యుత్ టారిఫ్‌ను విజయవాడలో నిన్న ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ సి.వి. నాగార్జున రెడ్డి మాట్లాడుతూ... చట్టప్రకారం టారిఫ్ రూపకల్పన జరిగిందని, ఇందులో భాగంగా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించి అభ్యంతరాలు, సూచనలు కూడా స్వీకరించామని చెప్పారు. ఇంధన ధరల అంచనాలకు, వాస్తవికతకు తేడా ఉంటుందని, అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ కొనుగోలుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని వివరించారు.

---------------------------

ప్రతి ఒక్కరు వారి ఓటు హక్కును వినియోగించుకొనేలా కేంద్ర ప్రభుత్వం 'మేరా పహేలా ఓట్ దేశ్ కేలిఏ' అనే ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. దేశవ్యాప్తంగా వివిధ కళాశాలలు, యూనివర్సిటీలలో ఈ కార్యక్రమాన్ని జరుపుతూ కొత్త ఓటర్లకు ఓటు హక్కు ప్రాధాన్యతపై కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన నూతన ఓటర్లు ఆకాశవాణితో మాట్లాడారు. తమకు ఓటు హక్కు రావడం ఎంతో సంతోషంగా ఉందని, దేశ అభివృద్ధికి తమ ఓటును ఈ ఎన్నికల్లో వినియోగిస్తామని వారు పేర్కొంటూ...

వాయిస్ - 15 సెకన్లు

---------------------------

విజయవాడలోని ప్రభుత్వ ఆసుపత్రికి రెండు అత్యాధునిక లైఫ్ సపోర్ట్ అంబులెన్సులు అందుబాటులోకి రావడంతో రోగుల ప్రాణాలను రక్షించేందుకు అవసరమైన వైద్య సేవలను సకాలంలో అందించేందుకు మరింత వీలవుతుందని విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శ్రీనివాస్ అన్నారు. విజయవాడలోని జీజీహెచ్‌లో 55 లక్షల రూపాయల ఎంపీ ల్యాడ్స్ నిధులతో సమకూర్చిన రెండు అత్యాధునిక అంబులెన్సులను విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు మల్లాది విష్ణువర్ధన్, జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు

తదితరులతో కలిసి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ... జీజీహెచ్‌కు ఉన్న అంబులెన్సుల అవసరాన్ని జిల్లా కలెక్టర్ తన దృష్టికి తీసుకొచ్చిన వెంటనే 70 లక్షల ఎంపీ ల్యాడ్స్ నిధులను మంజూరు చేసినట్లు వెల్లడించారు. జీజీహెచ్ నుంచి అత్యంత నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రణాళికాయుతంగా చర్యలు చేపట్టడం జరిగిందని.. అత్యవసర వైద్య సేవల వ్యవస్థను కూడా బలోపేతం చేసినట్లు వివరించారు.

======================